# ఆప్యాయత నడుమ ఆవేదన

"డాక్టర్ కాంతాదేవిగారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారు"?

"నన్నా".

"అవును డాక్టర్ రాత్రి కొత్తగా జాయిన్ అయిన 24వ బెడ్ పెషెంటు మీపేరు పలవరిస్తున్నాడు".

"అతనెవరో తెలుసా".

"నాకు తెలియదు డాక్టర్ అతని పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంది".

ఆశ్చర్యంగా నర్సు వైపు చూసింది డాక్టర్ పూర్ణిమ.

"రండి డాక్టర్" అంటూ వెను తిరిగిన నర్సు వెంట అనాలోచితంగా బయలు దేరింది పూర్ణిమ.

బెడ్ మీద ఉన్న ఆ వ్యక్తిని చూడగానె అసహ్యంతో మెలికలు తిరిగింది పూర్ణిమ. తర్వాత కోపంతో ఊగిపోయింది.

''ఛీ! ఛీ! నువ్వా! సిగ్గులేదు నాపేరు తలవడానికి'' నోరు పెగిలినంత గట్టిగా అరిచింది.

అప్పుడే స్పృహ వచ్చిన అతను కంటి రెప్పలు బరువుగా తెరిచి ఎదురుగా ఉన్న పూర్ణిమను చూసాడు అతనికి ఒక కన్ను సొట్ట. మిగిలిన కంటిలో ఆతని మనస్సులోని ఆనందం తళు

క్కన మెరిసి అది అతని ముఖ మండలం ఆక్రమించింది. ఆ సంతోషం వ్యక్తం చెయ్యడానికి అతని పెదిమలు కదిలాయి.

అవేమి గమనించే స్థితిలో లేదు పూర్ణిమ.

''ఛీ! ఛీ! ఇక్కడకు కూడా నా వెంట దాపురించావా? నీలాటి వాళ్ళు ఛస్తే లోకానికి పీడా విరగడవుతుంది''? ఆమె మాటలు అతి కఠినంగా ఉన్నాయి.

''నేను చెప్పేది వినమ్మా'' అతినీరసంగా ఉన్నాయి అతని మాటలు.

''యు షటప్, ఇడియట్'' ఇంక అక్కడ నిలబడలేక వెను తిరిగింద పూర్ణిమ.

పక్కనే నిలబడి ఇద్దరిని ఆశ్చర్యంగా చూస్తున్న నర్స్ పూర్ణిమ వెనక అడుగు వెయ్యబోయి ఆగిపోయింది. అతను బాధతో మెలికలు తిరుగుతున్నాడు. అంతలో అక్కడకు వచ్చిన కాంతాదేవి అతని పరిస్థితి గ్రహించి'' నర్స్ అక్సిజన్ రెడీచేయి'' ఆజ్ఞాపించింది.

నర్స్ ఆ పనిలో నిమగ్నమయింది.

''డాక్టర్! ఈ పెషెంటు వట్టి రోగ్ ఇడియట్'', అంది పళ్ళు నూరుకుంటూ పూర్ణిమ.

"పూర్ణిమ చావు బతుకుల్లో ఉన్న పేషంటుని చీదరించుకోడం మన వృత్తికి ద్రోహం చేసినట్టే. రాత్రి నుంచి అతను నీ పేరు కలవరిస్తున్నాడు. స్పృహ వచ్చేలా ఉందని నీకు కబురు చేసాను'' ఆ మాటలు విన్న అతను కాంతాదేవికి చేతులెత్తి నమస్కరించాడు.

అతని కంటిలో నుండి కన్నీరు జలజలా రాలుతోంది.

అతని కన్నీటిలో కాంతాదేవి హృదయం తడిసి ముద్ద యింది. పమిట కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"డాక్టర్! నన్ను మాట్లాడనీయండి" ఆక్సిజన్ పెట్ట కుండా అడ్డుపెట్టాడు.

"కాసేపు మాట్లాడడానికి వీలులేదు రెస్టుచాలాఅవసరం".

"డాక్టర్ నామాట వినండి, నేను బ్రతుకుతానన్న ఆశ లేదు. నాకు బ్రతకాలనీ లేదు. కానీ ఈ ప్రాణం పోయెలోగా ఒక్క నిజంతెలుసుకోవాలి డాక్టర్" అతని మాటలు తడబడ్డాయి.

నర్సు అందించిన ఇంజక్షన్ చేసి అతనికి పక్కగా నిలబడింది డాక్టర్ కాంతాదేవి.

దూరంగా నిలబడి చూస్తోంది పూర్ణిమ.

అతను తల కింద దాచిన ఒక ఫోట్ తీసి పూర్ణిమకు అందించబోయాడు.

పూర్ణిమ చెయ్యి చాపలేదు. నర్సు అందుకుని ఆ ఫోటో చూసి కాంతాదేవికి అందించింది. ఆమె ఆశ్చర్యంగా చూసి "ఈఫొటో ఎవరిది" అంటు అడిగింది.

"ఎవరిదో అయితే నేనెందుకు దాస్తా డాక్టర్. అది మా ఫామిలీ ఫొటో. అందులో మాఅమ్మా! నాన్నా, నేను,మాచిన్నారి చెల్లెలు పూర్ణిమ" అతని కంఠం దుఃఖంతో పూడుకుపోయింది. కాంతాదేవి, నర్సు ఆశ్చర్యపోయారు.

అతనిమాటలువిన్న పూర్ణిమ ఒక్కసారి ఉలిక్కిపడింది. ఒక్కఅడుగులో కాంతాదేవిని సమీపించి ఆమె చేతిలోని ఫొటో లాక్కుని చూసింది. అందులో తల్లీ తండ్రిని గుర్తుపట్టిన పూర్ణిమ 'అమ్మా! నాన్నా!' అంటు కెవ్వుమంది.

కాంతాదేవి పూర్ణిమను పట్టుకుంది. అది హాస్పిటల్ బెడ్ అనే మర్చిపోయింది పూర్ణిమ.

'మా అమ్మ, నాన్న, నేను, మా అన్నయ్య' అంటు డాక్టరుకి చూపించింది.

"అయితే ఇతను" పేషంటువైపు చూపించి అడిగింది ఆవిడ.

"ఈదురదృష్టవంతుడే అతను" అన్నాడు అతను.

అతను బాధను దాచుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. అయినా అతను లెక్కచెయ్యకుండా ఏదో చెప్పాలని తాపత్రయ పడుతున్నాడు.

"ఇంక మాట్లాడడానికి వీలులేదు" అంది కాంతాదేవి కంగారుగా.

"నో. డాక్టర్ నన్ను చెప్పనీయండి" అంటూ పూర్ణిమ వైపు తిరిగి చెప్పడం ప్రారంభించాడు. పూర్ణిమా! మా చెల్లెలు చిన్నతనంలోనె తప్పిపోయింది. నీలాగె ఉండేది. నువ్వేఅని నా అంతరాత్మ చెబుతోంది. మాఅమ్మ ఆబెంగతో మంచం పట్టింది. మానాన్న అంతకంటె బెంగ పెట్టుకున్నారు. ఆ సంవత్సరం గోదావరి వరదలు వచ్చాయి. మాఇల్లు మునిగిపోయింది. నన్ను

ఎవరో రక్షించారు. మాఅమ్మా, నాన్న అందులో మరణించారు. మాచిన్నాన్నే నన్ను పదవ తరగతివరకు చదివించారు. తర్వాత ఆయనపోయారు. నన్ను తెలుసున్నాయన హైదరాబాదు తీసుకు వచ్చారు. ఒక కంపెనీలో పనిదొరికింది. అక్కడ పని చేసుకుని వాళ్లింట్లోనే భోజనం చేసేవాడిని. దురదృష్టం వెంటాడుతూ వచ్చింది.

అతను గట్టిగా శ్వాస పీల్చుకున్నాడు.

కాంతాదేవి మరో ఇంజక్షను చేసింది. అతను చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడని తెలుసు. అయినా బ్రతికించాలనే ఆశ. "ఇంక మాట్లాడకు బాబూ" అంది.

"డాక్టర్ నన్ను చెప్పనీయండి. నానోరు ఎప్పుడో పడిపోయింది. అంతవరకు నన్ను ఆపకండి".

కాంతాదేవి అతన్ని వారించలేకపోయింది.

పూర్ణిమ పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ నిలబడలేక పక్కనేఉన్న కుర్చీలో కూర్చుంది.

తిరిగి చెప్పడం ప్రారంభించాడు అతను.

"ఆఇంట్లో అందరికి మశూచి వచ్చింది. అందరుతలుపులు మూసుకున్నారు కాని తలుపులు తెరవలేదు. నేనే వారికి సేవ చేశాను. వారికి తగ్గి మృత్యువునుండి బయటపడ్డారు. కాని నాకు వచ్చి ఈవికృతాకారంతో మిగిలిపోయాను. ఒక కన్ను పూర్తిగా పోయింది. శరీరంనిండా నల్లని మచ్చలు. అందరూ చీదరించుకుంటున్నా అందరిని నేను ప్రేమిస్తున్నాను. ఇటీవలనే ఈ

ప్రాంతానికి వచ్చాను. నిన్ను చూసాను. నా ఆనందానికి అంతు లేదు. జీవితంలో నువ్వు కనబడతావని అనుకోలేదు. ఆఫొటోలో ఉన్న నీఅన్నగారు భరత్‌ను నేనేనమ్మా!"

అతని మాటలు విన్నాక పరిశీలనగా చూస్తే అతనిలో చిన్నప్పటి పోలికలు కనబడ్డాయి పూర్ణిమకు. ఒక్కసారి అన్న గారిమీది ప్రేమ పొంగివచ్చింది. "అన్నయ్యా!" అంటూ అతని మీదికి వాలిపోయి అతని శరీరమంతా తడిమింది.

"అన్నయ్యా! మీచెల్లెలు పూర్ణిమను నేనే"

అతని ఒంటికన్ను జ్యోతిలా వెలిగింది. ఆకంటి చూపులో కోటికాంతులు. ఇన్నాళ్లు జ్ఞాపకం వచ్చినపుడల్లా తల్లి తండ్రులను అన్నగారిని తలుచుకుని ఏడుస్తూనేఉంది. ఆరోజు అన్నగారు కనబడితే తాను గుర్తించలేదు. ఈనాడు గుర్తించేసరికిఅన్నగారు చావు బతుకులో ఉన్నాడు. ఒకపక్క చెప్పలేని సంతోషం. మరో పక్క చెప్పలేని ఆవేదన. అన్నాచెల్లెళ్ళు ఇద్దరు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

ఏదో చెప్పుకోవాలనే ఆరాటం ఇద్దరిని నిలవ నియ్యడం లేదు ఇద్దరూ కారేకన్నీళ్ళు తుడుచుకుంటూనె ఉన్నారు. వారిని చూసిన కాంతాదేవి, నర్సుకూడా కళ్ళు తుడుచు కుంటున్నారు. పూర్ణిమ అతన్ని మొదట అసహ్యించుకోడానికి కారణం ఊహించు కోలేకపోయారు. ఆపరిస్థితిలో పూర్ణిమను అడగలేక ఊరు కున్నారు.

"అన్నయా! ఆరోజు ప్రభలతీర్థంలో నువ్వు నా చెయ్యి వదిలేసావు. నేను తప్పిపోయాను" అంది బుంగమూతి పెట్టి పూర్ణిమ. ఆమెకు అప్పుడే జరిగినట్టుగాఉంది ఆసంఘటన.

"అందుకే అమ్మ నన్నుకొట్టింది" అన్నాడు అతను.

"ఎవరోవచ్చి నన్ను ఎత్తుకుని దూరంగా తీసుకుపోయారు. అతను నల్లగాఉన్నాడు. నాచెవులు బంగారుజూకాలు బలవంతంగా లాక్కుని పారిపోయాడు. రక్తం కారుతుంటే ఆబాధతో ఒంటరి తనపు భయంతో ఎంతో ఏడ్చాను. నాఏడుపు విని అటు వచ్చిన భార్యాభర్తలు ఇంటికి తీసుకువెళ్లి నన్ను ఎంతో ప్రేమగా పెంచ డం మొదలుపెట్టారు. అయినా నేను మిమ్మల్ని తలుచుకొని ఏడు స్తూనె ఉన్నాను. నాలో ఆదొంగ భయం పోలేదు. ఎవరు నల్లగా కనబడినా దొంగఅనే భయం. అందుకే నిన్ను చూసి భయపడి తిట్టాను. కొట్టించాను కూడా". ఇంక ఆపుకోలేక చంటిపిల్లలా బావురుమంది పూర్ణిమ. అతను ఆయాసంతో మెలికలు తిరగడం ఆమె గమనించలేకపోతోంది. అతని పరిస్థితి విషమిస్తోందని తెలుసుకున్న కాంతాదేవి మరో డాక్టరుకి కబురుచేసింది. అతను వచ్చాడు. వాళ్ళప్రయత్నం వాళ్ళు చేస్తున్నారు.

అతని ఒక కన్నుధారాపాతంగా వర్షిస్తోంది. అతని ఎడమ చెయ్యి ఆమె తల మీదవేసి నిమురుతున్నాడు. అతనికి మాట్లాడా లని ఉంది కాని మాట్లాడ లేక పోతున్నాడు.

"డాక్టర్! డాక్టర్! మా అన్నయ్యను బ్రతికించండి డాక్టర్'' అంటూ వెక్కివెక్కి ఏడుస్తోంది పూర్ణిమ. చూసినవాళ్లు ఆమెకు మతిచలించిందనుకుంటారు అంత ప్రమాద స్థితిలోను అతనికి గతం కళ్ళ ముందు మెదిలింది.

తల్లి తండ్రులిద్దరు పిల్లల్నిచూసి మురిసిపోయేవారు ఒక రోజు పూర్ణిమ రాయితీసి కుక్కను కొట్టబోయింది అటుగా వస్తున్న భరత్ నుదుట తగిలింది. రక్తం బుడబుడా కారింది.

తల్లి వచ్చి డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళింది. డాక్టర్ కుట్లు వేసాడు. ఇప్పటికి ఆ మచ్చ ఉంది. చెల్లెలి మీద అనురాగంతో అక్కడ చేత్తో రాముకున్నాడు అతను.

"అన్నయ్యా: నిన్ను చిన్నప్పుడు ఇక్కడ కొట్టాను కదూ" అంది ఏడుస్తూ.

ఆ మాటలకు ఆ అన్నగారు పొంగిపోయాడు. కాని మాట్లాడడానికి అతనికి ఓపిక చాలడంలేదు.

"పూర్ణిమా! నువ్వు ధైర్యంగా ఉండాలి, పేషెంటుని కంగారు పెట్టకూడదు. డాక్టరువై వుండి నువ్విలా చిన్న పిల్లలా ఏడిస్తే ఎలా".

నర్సు పూర్ణిమను పట్టుకుంది. అతనికి ఆక్సిజన్ పెట్టారు. ఆ దృశ్యం చూడలేక విలవిల్లాడుతోంది పూర్ణిమ.

"డాక్టర్ మా అన్నయ్యను బ్రతికించండి డాక్టర్" ఆమె నర్సును విడిపించుకుని వెళ్ళి కాంతాదేవి రెండు చేతులు పట్టుకుంది "ఏం భయం లేదమ్మా! నువ్వు ఏడవ కూడదు. ధైర్యంగా ఉండాలి".

"ఎలా ఏడవకుండా ఉండను డాక్టర్. ఆ రోజు బస్సు దిగి ఇంటికి వెడుతున్నాను. కాస్త చీకటి పడింది నా వెంట ఇతను వస్తున్నాడు. దొంగనే భయంతో నేను ముందుకు వేగంగా అడుగులు వేసాను అతనుకూడా వేగం హెచ్చించి ఏదో చెప్ప బోయాడు. నేను వినిపించుకోకుండా దొంగ! దొంగ! అని అరిచాను.

నా కేకలకి జనం పోగై అతన్ని పట్టుకుని చావగొట్టారు. దొంగని అన్నగారినే చావకొట్టించిన మూర్ఖురాలిని డాక్టర్. అంటూ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"అది నీ తప్పుకాదు పూర్ణిమ! ఇప్పుడు నువ్వు ఏడవ కూడదు. అతను కంగారు పడతాడు. ధైర్యంగా ఉండాలి".

"ఎలా ఉండను డాక్టరు. ఒక రోజు నేను వీధివరండాలో కూర్చుని చదువుకుంటున్నాను. గేటు తీసుకుని అతను రావడం చూసి కెవ్వున అరిచాను మా నౌకర్లు పరుగెత్తుకుంటూ వచ్చారు.

అతను పారిపోకుండా నా వైపు చూస్తూ అలాగె నిలబడి పోయాడు. ఎదురుగా అన్నగారు నిలబడితే గుర్తించలేని మూర్ఖురాలిని నేను డాక్టర్. పైగా మా నౌకరు అతన్ని గేట్లో నుంచి బైటకు తోసి తలుపులు పెట్టాడు. అతని తల పగిలి రక్తం కారడం చూసాను. అతను జాలిగా నావైపుచూస్తూ వెళ్ళిపోయాడు. అప్పుడేనా గ్రహించుకోలేని కఠినాత్మురాలిని నేను డాక్టర్".

"ఏడవకు! పూర్ణిమా! ఈ కాలంలో ఆడపిల్లలు మగ వారిని అంత కంటె అర్థం చేసుకోలేరు. కాలం అటువంటిది. నువ్వు బాధపడి ప్రయోజనం లేదు. ధైర్యంగా ఉండాలి".

"ఎలా ధైర్యంగా ఉండను డాక్టర్. కాలం అటువంటి దయినా అది నా జీవితంలో శాపంలా తగిలింది" మరింత బాధ పడింది పూర్ణిమ.

అతన్ని చూసిన పెద్దడాక్టర్ "బెటర్ పొషిషన్" అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

అన్న గారికి దగ్గరగా జరిగింది పూర్ణిమ. అతని చూపులు ఆమె మీదే ఉన్నాయి.

'అన్నయ్యా! నా తప్పు క్షమించు నిన్ను చచ్చిపొమ్మని తిట్టాను. కాని ఇప్పుడు నువ్వు నాకోసం బతకాలి అన్నయ్యా'' అంది పూర్ణిమ కళ్ళు ఒత్తుకుంటు.

ఏడవకన్నట్లుగా అతను సంజ్ఞ చేసాడు అతని ముఖం చిరునవ్వుతో వెలుగుతోంది. అతను చెల్లెలి వైపు అభిమానంతో చూస్తూన్నాడు. పూర్ణిమ అతనికి ఏదో చెబుతూనె ఉంది.

ఆ అన్న చెల్లెళ్ళ అప్యాయత నడుమ ఉన్న ఆవేదనను చూడలేక కాంతాదేవి, నర్సు కళ్ళు తుడుచుకుంటున్నారు.

అతని ప్రాణం పోయిందని ముందుగా తెలుసుకున్న కాంతాదేవి ఆ విషయం పూర్ణిమకు ఎలా చెప్పాలో తెలియక తికమక పడింది.

సమాప్తము